తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

బద్దెనపల్లి జీపీకి ఎన్నికలు జరిగేనా?

- ఆరేండ్లుగా ప్రత్యేక పాలనలోనే గ్రామం
- 2019లో రిజర్వేషన్‌పై కోర్టులో కేసుతో ఆగిన ఎన్నిక
- కొద్ది రోజుల కిందే కేసు వాపస్.. మార్గం సుగమం

సిరిసిల్ల రూరల్, జూలై 28: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామపంచాయతీ ఆరేండ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలోనే నడుస్తున్నది. ఈ గ్రామానికి చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. అప్పుడు బీసీ మహిళా రిజర్వేషన్ రావడంతో గగ్గిళ్ల నిర్మల ఎన్నికయ్యారు. ఈ క్రమంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సర్కార్ కొత్త పంచాయతీ రాజ్ చట్టం-2018 రూపొందించి, 2019లో జనవరిలో ఎన్నికలు నిర్వహించారు. సర్పంచ్ పదవి రిజర్వేషన్‌పై కొందరు కోర్టులో కేసు వేయగా, ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. తర్వాత కోర్టు కేసు క్లియర్ అయినా కొన్ని కారణాలతో ఎన్నిక జరుగలేదు. దీంతో ఆరేండ్లుగా ప్రత్యేకాధికారి పాలనలో కొనసాగుతున్నది. తాజాగా కాంగ్రెస్ సర్కార్ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తుండడంతో అందరి చూపు బద్దెనపల్లి వైపు మళ్లింది. ఈ సారైనా గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయో..? లేదా..? అని చర్చ జరుగుతున్నది. కాగా బద్దెనపల్లి పంచాయతీ ఎన్నికకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా నిర్వహిస్తామని ప్రత్యేకాధికారి భూపేశ్ పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రుద్రంగి, జూలై 28: మండల కేంద్రానికి చెందిన మరిపెల్లి తిరుపతిగౌడ్ ఆదివారం సాయంత్రం గ్రామంలోని శివారులో గల తాటి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తూ మోకు జారి కిందపడగా గాయాలయ్యాయి. తిరుపతిగౌడ్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. అన్నివిధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వీర్నపల్లిలో రోడ్డు పనులు, రంగంపేట, దుమాలలో పాఠశాలల తనిఖీ

వీర్నపల్లి: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వీర్నపల్లి, జూలై28: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మండల కేంద్రంలో డబుల్ రోడ్డు పనులను ఆదివారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల వివరాలు గుత్తేదారును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులను సమన్వయం చేసుకొని పనుల్లో వేగం పెంచాలన్నారు. ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని అదేశించారు. నాసిరకంగా పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వానకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

ఈ గదుల్లో పాఠాలు ఎందుకు చెబుతున్నరు?

అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల్లో పాఠాలు ఎందుకు చెబుతున్నారని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగంపేటలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పూర్తిస్థాయిలో నిర్మాణంలేని గోడ, ఫ్లోరింగ్ సరిగా లేక బండరాళ్లపై టేబుళ్లు వేసి ఉండడాన్ని చూసి మండిపడ్డారు. తరగతి గదులంటే ఇంత నిర్లక్ష్యమా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత మంది విద్యార్థులున్నారు.. ఎన్ని తరగతి గదులున్నాయని ప్రశ్నించారు. తక్షణమే ఆ గదుల్లో బెంచీలు తీసివేయాలని అదేశించారు. పనులు ఎందుకు మధ్యలోనే నిలిపివేశారని గుత్తేదారుడిని అడిగి తెలుసుకున్నారు. చేసిన పనుల బిల్లులు మొత్తానికే రాకపోవడంతో పనులు చేయడం లేదని గుత్తేదారు తెలిపారు. బిల్లులు మంజూరు చేయించే బాధ్యత నాది.. మీరు పనులు మొదలుపెట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడ ఎంఈవో రఘుపతి, ఏఈ శ్రీకాంత్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్, హెచ్ఎం మానసవీణ, తదితరులు ఉన్నారు.

దుమాల 'ఏకలవ్య' పాఠశాల సందర్శన

ఎల్లారెడ్డిపేట, జూలై 28: దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం తనిఖీ చేశారు. కొన్ని రోజులుగా హాస్టల్‌లో బ్రేక్‌డౌన్ కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కరెంటు సమస్య లేకుండా చూడాలని సెస్ ఏఈ పృథ్వీని ఆదేశించారు. అంతకుముందు డార్మెటరీ, భోజనశాల, విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు.

30న రుణమాఫీ రెండో విడుత నిధులు విడుదల

కలెక్టరేట్, జూలై 28: రుణమాఫీ రెండో విడుత నిధులను ప్రభుత్వం ఈ నెల 30న ఉదయం 11గంటలకు విడుదల చేస్తుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో 30న కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో రెండో విడుత రుణమాఫీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని, రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుంతలమయమైన రహీంఖాన్‌పేట-వెల్జీపూర్ గ్రామాల బీటీ రోడ్డు

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?

ఇల్లంతకుంట మండల కేంద్రం నుంచి రహీంఖాన్‌పేట-వెల్జీపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు నిల్వడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

-ఇల్లంతకుంట, జూలై 28

ప్రయాణ ప్రాంగణం.. బురదమయం

బురదమయమైన బస్టాండ్‌లో ఆగిన బస్సులో నుంచి దిగుతున్న ప్రయాణికులు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం బురదమయమైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో బస్టాండ్ ప్రాంగణమంతా చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ప్రతిరోజూ బస్టాండ్‌లో బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బురదలో జారిపడి పలువురు ప్రయాణికులు గాయపడిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

- ఎల్లారెడ్డిపేట, జూలై 28

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, జూలై 28: సనుగులలోని 33 /11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చందుర్తి సెస్ ఏఈ మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సనుగుల, దేవునితండా, లింగంపేట, కిష్టంపేట, రామారావుపల్లి గ్రామాల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర

మహంకాళీ అమ్మవారికి పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూలై 28: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో బ్రిడ్జి వద్ద గల ఉజ్జయినీ మహంకాళి జాతర మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ శ్రీనివాస్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు.

మహాలక్ష్మి ఆలయంలో 'దిష్టికుంభం'

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న చల్మెడ, నాయకులు

వేములవాడ టౌన్, జూలై 28: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ మహాలక్ష్మి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దిష్టికుంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఈ వేడుకకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, రూరల్ మండలాధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు కుమ్మరి శ్రీనివాస్, కొండ కనకయ్య, కొండ నర్సయ్య, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, మాడిశెట్టి కృపాల్, కట్కూరి శ్రీనివాస్, సుంకపాక రాజు, పోతు అనిల్, లింగం, రాకేశ్, సందీప్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రేణుకింది అశోక్, నాయకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, జూలై 28: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1998-1999 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 25ఏండ్ల తర్వాత ఒకచోట కలిశారు. తమకు చదవులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

వివాహ వేడుకకు హాజరు

వేములవాడ రూరల్, జూలై 28: మున్సిపల్ పరిధిలోని ఇస్లాంనగర్‌కు చెందిన సయ్యద్ ఆలీ వివాహ వేడుకలు పెద్దూరులోని జీకే ఫంక్షన్‌హాల్‌లో జరుగగా, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వాసాల శ్రీనివాస్, ఇస్లాంనగర్ వాసులు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్, జూలై 28: మున్సిపల్ పరిధిలోని తుర్కకాశీపల్లెకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత షేక్‌అలీ కూతురు వివాహం ఆదివారం స్థానిక పెద్దూరులోని జీకే గార్డెన్‌లో జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, సింగిల్‌విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, నాయకులు హాజరయ్యారు.

వేములవాడ రూరల్: చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో బోనాల వేడుకలో పాల్గొన్న కాలనీవాసులు

ఘనంగా బోనాల పండుగ

వేములవాడ రూరల్, జూలై 28: చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు సంఘం మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు.

వేములవాడ టౌన్, జూలై 28: పట్టణంలోని భగవంతరావునగర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బద్ది పోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో డప్పుచప్పుళ్ల మధ్య పురవీధుల గుండా అమ్మవారికి బోనాలు సమర్పించారు. వేడుకల్లో సంఘం అధ్యక్షుడు చందనం రఘుపతి, సభ్యులు శ్రీనివాస్, దేవనాచారి, వెంకటస్వామి, రవీందర్, దేవేందర్, శ్రీనివాసచారి, మురళి పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శిశు మందిర్ పాఠశాల విద్యార్థులు బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఇక్కడ హెచ్ఎం గట్టు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, జూలై 28: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం తీసి ఊరేగింపుగా రేణుకామాత ఆలయం వద్దకు వెళ్లారు. అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ పందిర్ల లింగంగౌడ్, బుచ్చిలింగ్ సంతోష్‌గౌడ్, కిషన్, లక్ష్మారెడ్డి ఉన్నారు.

సిరిసిల్ల టౌన్, జూలై 28: జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం కాలనీవాసులు బంగారు మైసమ్మకు బోనాలు సమర్పించారు. డప్పుచప్పుళ్లు, పోతరాజుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ సామల సుప్రియ, సామల శ్రీనివాస్, లగిశెట్టి అన్నపూర్ణ, ప్రకాశ్, చిప్ప పోశెట్టి, ప్రసాద్, ఎర్రగుంట మహేశ్, గెంట్యాల మల్లేశం, సత్యనారాయణ, సరిత, లలిత ఉన్నారు.

ఇల్లంతకుంట, జూలై28: మండల కేంద్రంలోని విశ్వకర్మ కులస్తులు పోచమ్మ బోనాలు తీశారు. గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గంభీరావుపేట, జూలై 28: మండల కేంద్రంలోని మహంకాళీ అమ్మవారికి ముదిరాజ్, గౌడ, రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. తర్వాత అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో మహంకాళీ అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

రోజూ ముసురే..

- వేములవాడలో 15రోజులుగా వర్షం
- వర్షపాతం మాత్రం తక్కువే నమోదు
- పనులన్నింటికీ ఆటంకం.. పంటచేలకు నష్టం

వేములవాడ రూరల్ మండలం ఎదుట కురుస్తున్న వర్షం

వేములవాడ, జూలై 28: వానకాలంలో వర్షాలు పడడం సర్వసాధారణమే. అయినప్పటికీ 15రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురుతో ప్రజలు మాత్రం అతలాకుతలం అయ్యారు. వర్షాలు నేపథ్యంలో వేములవాడలో మాత్రం అత్యంత స్వల్పంగా కేవలం 52.45సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇక రోజు వర్షం కురవడంతో ఇటు పనులకు.. వ్యాపారానికి ఆటంకం అవ్వడమే కాకుండా రైతులు కూడా ఇబ్బందిపడ్డారు. పంట చేనులో కూడా అడుగుపెట్టనీయకుండా చేసింది ముసురు. ఈ 15 రోజుల్లో ముసురుతో కురిసిన వాన కేవలం 22.6 సెంటిమీటర్లు మాత్రమే. గతేది జూలై నెల వరకు 73సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 52సెంటీమీటర్లే నమోదైంది. వేములవాడ ప్రాంతంలో గత 15 రోజులుగా కురిసిన వర్షం కేవలం ముసురుకు మాత్రమే పరిమితం కాగా, కనీసం ఒక్కోరోజు సెంటీమీటర్ వర్షం కూడా నమోదు కాలేదు. అత్యంత స్వల్పంగానే వర్షపాతం నమోదైనప్పటికీ రోజు ముసురుతో వాన పడడంతో వానకాలాన్ని మాత్రమే తలపించింది. 15రోజులుగా ముసురు పడడంతో పత్తి, మక్క, ఇతర కూరగాయల మొక్కలను నష్టం వాటిల్లింది. ఆదివారం మాత్రం కొంచెం పోడి వాతావరణం రావడంతో ప్రజలు ఊపిరితీసుకున్నారు.

పేరెంట్స్‌ను అడ్డుకున్న ప్రిన్సిపాల్

ఇల్లంతకుంట, జూలై 28: మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం విద్యార్థినులను వారి తల్లిదండ్రులు చూడడానికి వస్తే లోనికి రాకుండా ప్రిన్సిపాల్ శోభారాణి అడ్డుకుని ఇబ్బందులకు గురిచేశారు. ఇతర మండలాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను చూడకుండా చేయడంతో ఆవేదనకు గురయ్యారు. పాఠశాల ఎదుట గంటలపాటు నిరీక్షించినా విద్యార్థినులను చూడనివ్వలేదు. దీంతో ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యారిన్థుల పేరెంట్స్ కోరారు.

వేములవాడ-కొదురుపాక బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలు

ఆదమరిస్తే అంతే..

- వేములవాడ-కొదురుపాక బ్రిడ్జి వద్ద గుంతలు
- తరుచూ ప్రమాదాలు

వేములవాడ మండలం ఆరెపల్లి వద్ద వేములవాడ-కొదురుపాక బ్రిడ్జి వద్ద గుంతలు ఏర్పడ్డాయి. కరీంనగర్ నుంచి వేములవాడ వచ్చే క్రమంలో కొదురుపాక బ్రిడ్జి దిగే సమయంలో అతి వేగంగా వచ్చే వాహనదారులు గుంతలను ఆదమరిస్తే అంతేసంగతీ.. గుంతలను గమనించక ఇటీవల చాలా మంది ప్రమాదాల బారినపడ్డారు. నిత్యం అధికారులు అటు వైపు నుంచి వస్తున్నా.. పట్టించుకోవడం లేదు. కనీసం సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

- వేములవాడ రూరల్, జూలై 28

ఏడో రోజుకు చేరిన నేతన్నల దీక్షలు

దీక్షా శిబిరంలో కూర్చున్న నేతన్నలు

రాజన్న సిరిసిల్ల, జూలై 28 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో నేతన్నలు చేపట్టిన రిలేదీక్షలు ఆదివారంతో ఏడో రోజుకు చేరుకున్నది. దీక్షా శిబిరాన్ని పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు భాస్కర్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో ధర్నా చేసిన తర్వాత కూడా ప్రభుత్వంలో ఏ మాత్రం స్పందన లేకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించాలని జేఏసీ పిలుపునిచ్చింది. దీక్షా శిబిరంలో వైపని యూనియన్ గౌరవాధ్యక్షుడు ఒగ్గు గణేశ్, ఆసాముల సంఘం ఉపాధ్యక్షుడు పొరండ్ల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త వెంగళ అంకయ్య, అంబటి రవీందర్, సందుపట్ల పోచమల్లు, తాటి కొండ శ్రీనివాస్, బూర అంబరీశ్ పాల్గొన్నారు.

గంభీరావుపేటలో చోరీ

గంభీరావుపేట, జూలై 28: మండల కేంద్రంలోని కొమటిరెడ్డి కొండల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు శనివారం రాత్రి అతడి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వెండి సామగ్రి ఎత్తుకెళ్లారని బాధితులడు ఫిర్యాదు చేయగా, డాగ్‌స్క్వాడ్ సాయంతో పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.

హైదరాబాద్ తరలిన ఫొటో అసోసియేషన్ సభ్యులు

వేములవాడ రూరల్, జూలై 28: మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తెలంగాణ ఫొటో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. ఇక్కడ బొమ్మెన శ్రీనివాస్, సందెల నరేశ్, అజ్జు, సుధాకర్, సాగర్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

విప్ పరామర్శ

రుద్రంగి, జూలై 28: మండల కేంద్రానికి చెందిన ఎల్లాల నర్సరెడ్డి, దేశవేణి గంగమ్మ, సుడిగేపు మల్లయ్య, సూకిని కాంత చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. బాధిత కుంటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇక్కడ చెలుకల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, అల్లూరి లచ్చిరెడ్డి, రాజిరెడ్డి ఉన్నారు.

యువకుడి మృతి

రాంనగర్, జూలై28: గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన దొంతినేని అభినయ్(24) కరీంనగర్‌లోని రెనాల్ట్ షోరూంలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి బైపాస్‌లో ఉన్న హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి తల్లి శైలజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సరిలాల్ తెలిపారు.

మహరాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం
సిరిసిల్ల గారి సన్నిధిలో
యస్.ఓ.పి.నెం. 01/2024
1. బత్తిని ఎల్లవ్వ
2. బత్తిని బాలయ్య
మరియు ...వాదులు
1. సబ్ పోస్ట్ ఆఫీస్, గంభీరావుపేట
2. హెడ్ పోస్ట్ ఆఫీస్, జగిత్యాల
3. ఎవరికి సంబంధించితె వారికి - ప్రతి వాదులు
రాజన్న సిరిసిల్ల జిల్లా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు సిరిసిల్ల నందు 1. బత్తిని ఎల్లవ్వ 2.బత్తిని బాలయ్య, కుటుంబ సభ్యుల దృవీకరణ పత్రం కోసం కేసు వేసినారు. గతంలో బత్తిని @ పోతిరెడ్డి బాల లక్ష్మి సబ్ పోస్టాఫీస్ గంభీరావుపేట నందు రూ॥ 1,04,800/- RPLI పాలసీ నెం. 00000062260409 ద్వారా కట్టినారు. తేది:28-08-2022 నాడు మరణించినది. గతంలో బత్తిని బాలలక్ష్మి పోతిరెడ్డి ఎల్లయ్యను వివాహం చేసుకున్నది. సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు సిద్దిపేట్ నందు O.P.No.25 of 2008 ద్వారా విడాకులు ఐనవి. పైన తెలిపిన పిటిషినర్ నెం. 1&2 మొదటి శ్రేణి వారసులు కాగలరు. కావున వీరి పేరున కుటుంబ సభ్యుల దృవీకరణ పత్రం ఇచ్చినచో ఎవరికైన ఆక్షేపనలు,అభ్యంతరాలు ఉన్నచో ఇట్టి కోర్టు తేది:31-07-2024 తెలుపగలరు. లేనిచో పిటిషినర్ నెం1&2 కు కుటుంబ సభ్యుల పేరున జారీచేయబడును.
తేది: 27-07-2024 స్థలం: సిరిసిల్ల
ఇట్లు.. సం/- **కుడిక్యాల రాజేశం, అడ్వకేటు-నోటరీ**
సిరిసిల్ల. సెల్: 93933 73158

అడవిని కాపాడుకుందాం

ఎల్లారెడ్డిపేట, జూలై 28: అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సకారాంనాయక్, పద్మలత తెలిపారు. ఐదు రోజులుగా అలైన్‌మెంట్ కార్యక్రమం పూర్తి చేసి, మూడు రోజులుగా మొక్కలు నాటిస్తున్నట్టు చెప్పారు. మొక్కలను బాధ్యతగా కాపాడాలని సూచించారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

సిరిసిల్ల టౌన్, జూలై 28: గురుకులాల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్ ఆరోపించారు. ఆదివారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో ఇంత మంది విద్యార్థుల మరణాలు జరుగుతున్నా.. ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించక పోవడం విచారకరమన్నారు. పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మరణించాడని, అదే గదిలో మరో విద్యార్థికి పాముకాటు వేసిందన్నారు. హైకోర్టు జడ్జితో గురుకుల వసతి గృహాల సమస్యలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ టౌన్ సెక్రటరీ ఎనగందుల శ్రీనివాస్, ఎస్‌డీఎఫ్ జిల్లా కన్వీనర్ లోపల్లి రాజు రావు, శివసాయి, గౌతమ్ సాయి, అనిల్, నితిన్, జగన్, పవన్ ఉన్నారు.

ఎస్సారార్‌కు చేరుకుంటున్న జలాలు

బోయినపల్లి, జూలై28: గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి జలాలు చేరుకుంటున్నాయని ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల వరకు వరద కాలువ ద్వారా ఎల్లంపల్లి నుంచి 12.037క్యూసెక్యుల వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరిందని వారు చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.53 టీఎంసీలు నిల్వ ఉందన్నారు.

ఆడుకుంటూ.. అనంతలోకాలకు..

- సంపులో పడి మూడేండ్ల బాలుడి మృతి
- వెంకటాపూర్‌లో ఘటన

స్వేహాన్స్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 28: అప్పటి వరకు ఇంటి ఎదుట కండ్ల ముందే ఆడుకుంటున్న మూడేండ్ల కొడుకు.. ప్రమాదవశాత్తూ సంపులో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్ పరిధిలోని గాజులపల్లికి చెందిన పెద్దోళ్ల అనూష-కిషన్ దంపతులకు మూడేండ్ల కొడుకు స్వేహాన్స్ ఉన్నాడు. రోజువారీ మాదిరిగానే ఆదివారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తూ ఇంటి సమీపంలో గల సంపులో పడిపోయాడు. ఇంటిలోనే పనిలో నిమగ్నమైన అనూష స్వేహాన్స్‌ను గమనించలేదు. కొద్ది సేపటి తర్వాత బాలుడి కోసం వెతకగా సంపులో కనిపించాడు. వెంటనే బాలుడిని బయటికి తీసి.. స్థానికుల సాయంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వేములవాడ